సాక్షి ఒడిశా

సోమవారం । 13 । అక్టోబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 7,03,819

బంగారం : 1 గ్రాము 360 మిల్లీ గ్రాములు

వెండి : 26 గ్రాములు 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/ పూరీ



ఉన్మాది హల్‌చల్

మద్యం మత్తులో ఓ ఉన్మాది హల్‌చల్ చేశాడు. కత్తి పట్టుకుని దాడి చేశాడు.

- 8లో



యోగాతో ప్రశాంతత

పర్లాకిమిడి కాలేజీలో యోగా ప్రదర్శన జరిగింది. విద్యార్థులు పాల్గొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

• మరొకరికి గాయాలు



నిరంజన్ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి సికరపాయిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడు సికరపాయిలోని డొంగిరియా వీధికి చెందిన నిరంజన్ మినియాక (30)గా గుర్తించగా గాయాలు తగిలిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన నవీన్ తియాకగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. క్షతగాత్రున్ని చికిత్స కోసం గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి పంపించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి సికరపాయిలో జరుగుతున్న గజలక్ష్మి పూజలను చూసేందుకు నిరంజన్ తన బైక్‌పై తన గ్రామం నుంచి వెళ్లాడు. అదే సమయంలో పూజ మండపం వద్ద ఎదురుగా మరో బైకుపై వస్తున్న నవీన్ అదుపు తప్పి ఇద్దరు ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు బైకుల పైనుంచి కింద పడిపోగా సంఘటన స్థలం వద్దే నిరంజన్ తీవ్రగాయాలకు గురై మృతి చెందగా నవీన్ గాయాల పాలయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పడి ముగ్గురికి గాయాలు



మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్ గోలారీ కుటుంబం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా తామ్సా పంచాయతీ చాంపాఖారి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన శంకర్ గోలారీ అనే వ్యక్తి తన కుటుంబంతో ఇంటిలో నిద్రపోతున్న సమయంలో పైకప్పుపై పిడుగు పడింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. ఐదేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. పాప పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

ఆస్పత్రిపైనుంచి పడి వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ: కోరాపుట్‌కు చెందిన పూజారి నరసింగ్(28) అనే వ్యక్తి ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి 5వ అంతస్తు నుంచి పడి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసింగ్ కోరాపుట్ జిల్లా కెందుగూడ గ్రామంలో కుటుంబ సభ్యులతో నివసిస్తూ.. స్థానిక ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా అతను మద్యానికి బానిస కావడంతో పూజారి విధుల నుంచి గ్రామస్తులు తొలగించారు. దీంతో మద్యానికి మరింతగా బానిసయ్యాడు. ఇటీవల అతని స్నేహితురాలు తులసిదాస్ అత్తగారికి అనారోగ్యంగా ఉండటంతో ఆమెతో కలిసి మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆస్పత్రిలో కనిపించకపోవడంతో అతని భార్య పున్నీ పూజారికి తులసీదాస్ ఫోన్‌చేసి తెలియజేసింది. అయితే అదేరోజు అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రి 5వ అంతస్తు నుంచి పడిపోవడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. దీంతో ఆస్పత్రిలో ఉన్న రోగులను, వారి బంధువులను అప్రమత్తం చేయడంతో తులసి దాస్ చనిపోయిన వ్యక్తి తనతో పాటు వచ్చిన నరసింగ్‌గా గుర్తించి ఆస్పత్రి వర్గాలకు తెలిపింది. వారు అత్యవసర వైద్య విభాగానికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై అతని భార్య పున్నీ పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. తన భర్త మద్యానికి బానిసై కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, ఈ క్రమంలో ఆస్పత్రి పైఅంతస్తు నుంచి పడిపోయి ఉంటాడని, అతని మృతిపై ఎలాంటి అనుమానం లేదని భార్య పున్నీ పూజారి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు.

భారీగా గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో కోరాపుట్ జిల్లా పోలీసులు



వ్యాన్‌లో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు

కోరాపుట్: కోరాపుట్ జిల్లా పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కోరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి కుర్లగుడ జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. కూరగాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ కింది భాగాన క్వింటాల్ గంజాయి పట్టుబడింది. ఈ వ్యాన్‌లో ఉన్న నబరంగ్‌పూర్ జిల్లా రాయగర్‌సమితికి చెందిన రాజు మండల్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణ సింగ్, హర్తిక్ చౌహాన్‌లను అరెస్ట్ చేశారు. మల్కన్‌గిరి జిల్లా బలిమెలలో గంజాయి కొనుగోలు చేసి ఉత్తర్ ప్రదేశ్ రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బొయిపరిగుడ ఓసీ డొంబురుధర్ బత్రియా, ఎస్ఐ ధీరేంద్ర బారిక్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల వాహనంలో గంజాయి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసులు కూరగాయలు రవాణా చేస్తున్న వ్యాన్‌లో గంజాయి పట్టుకున్నారు. శనివారం మలకన్‌గిరి జిల్లా బలిమెల నుంచి కుడుములుగుమ్మ, బొయిపరిగుడల మీదుగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి గంజాయి రవాణా జరుగుతోందని, ఓ వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఏఎస్ఐ ధీరేంద్ర బారిక్ నేతృత్వంలో ఒక టీమ్‌ను పంపిచామని బొయిపరిగుడ పోలీసు అధికారి డొంబురు బత్రిక తెలిపారు. వ్యాన్‌ను అడ్డుకుని తనిఖీ చేయగా గంజాయి దొరికిందని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు. వారిలో ఒకరు నవరంగపూర్ జిల్లా రాయగర్ వాసి రాజు మండల్ కాగా ఇద్దరు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర వాసులు కృష్ణ సింగ్,హితిక్ చౌహాన్‌లు అని పోలీసు అధికారి వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

జయపురం: జయపురం రైల్వే స్టేషన్ సమీప ప్రాంతంలో జయపురం అబ్కారి సిబ్బంది దాడి జరిపి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద 4.1 కిలోల గంజాయి పట్టుకున్నట్లు జయపురం అబ్కారి సటేషన్ అధికారి శుబ్రత్ కేశరీ హిరన్ వెల్లడించారు. అరెస్టయిన వ్యక్తి కేరళ రాష్ట్ర తిరువనంతపూర్ జిల్లా పుబర పోలీసు స్టేషన్ పరిధి కొలురు గ్రామం బయిజు జెమ్స(48) అని వెల్లడించారు. నిందితుడు ఈ ప్రాంతంలో చట్ట విరుద్ధంగా ఎక్కడో గంజాయి కొని బెగ్‌లో భద్ర పరచి రైలులో విశాఖపట్నం, అక్కడి నుంచి కేరళకు వెళ్లేందుకు జయపురం రైల్ స్టేషన్ ప్రాంతంలో వేచి ఉన్నాడని తెలిపారు.

నవంబర్ 23న స్పందన వార్షికోత్సవం



మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి, పక్కనే గుడ్ల గౌరీశంకర్, రామారావు

• వివిధ పోటీల నిర్వహణకు నిర్ణయం

రాయగడ: స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 30వ వార్షికోత్సవాన్ని నవంబర్ 23వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నారు. ఈ మేరకు రామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సభ్యుల సమావేశంలో సంస్థ అధ్యక్షులు గుడ్ల గౌరీశంకర్ ప్రకటించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థుల మధ్య వివిధ పోటీలను నిర్వహించేందుకు సమావేశంలో నిర్ణయించారు. అలాగే మహిళల మధ్య మెహేందీ పోటీలతో పాటు విద్యార్థుల మధ్య చిత్రలేఖనం, విచిత్ర వేషధారణ పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 1995 ఆగస్టు 15వ తేదీన ఆవిర్భవించిందని సంస్థ సాంస్కృతిక విభాగం కార్యదర్శి కొండవలస క్రిష్ణమూర్తి పట్నాయక్ అన్నారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించడంలో సంస్థ విశేషంగా కృషి చేస్తుందని వివరించారు. సమావేశంలో సంస్థ సాహితీ విభాగం కార్యదర్శి సింగిడి రామారావు పాల్గొన్నారు.

శ్రీ మందిరంపై ఎగిరిన డ్రోన్ స్వాధీనం



భద్రతా దళాలు స్వాధీనపరచుకున్న డ్రోన్

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని ఆలయ శిఖరంపై చక్కర్లు కొట్టిన డ్రోన్‌ను భద్రతా దళాలు స్వాధీనపరచుకున్నారు. శ్రీ మందిరం ప్రాంగణం నో ఫ్లయింగ్ జోన్‌గా లోగడ ప్రకటించారు. ఇటీవల ముగిసిన రథ యాత్ర సందర్భంగా డ్రోన్ వ్యతిరేక ప్రాంతంగా ప్రకటించారు. అధికారిక ప్రకటనలు ఇలా ఉండగా తరచూ ఆలయ శిఖరంపై తరచు డ్రోన్ చక్కర్లు కొట్టడం, డ్రోన్ వీడియో రికార్డింగు క్లిప్‌లు సాంఘిక మాధ్యమంలో ప్రసారం కావడం భక్తజన హృదయాల్ని కలవరపరుస్తున్నాయి. తాజాగా శ్రీ మందిరం ప్రాంగణం రెడ్ జోన్‌లో చేర్చినట్లు పౌర విమాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ప్రకటించింది. తాజా సంఘటనలో శ్రీ మందిరం శిఖరంపై డ్రోన్ చక్కర్లు కొట్టించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని స్థానిక శని మందిర్ వీధిలో డ్రోన్ స్వాధీనపరచుకున్నారు. డ్రోన్‌ను ఎగురవేసిన చత్తీస్‌గఢ్‌కు చెందిన యువకుడిగా గుర్తించి రెడ్ జోన్ నిబంధనల పరిధిలో అరెస్టు చేసినట్లు పూరీ జిల్లా పోలీసులు తెలిపారు.

ముగిసిన నందన్న పూజలు



నిమజ్జనోత్సవంలో చిందులు వేస్తున్న యువతీ, యువకులు



నందన్న విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువెళుతున్న దృశ్యం

రాయగడ: స్థానిక కంద్రవీధిలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న నందన్న పూజలు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు గౌరీ పార్వతులకు ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. సాయంత్రం విగ్రహాలను స్థానిక నాగావళి నదికి తరలించి నిమజ్జనం చేశారు.

నిండు గర్భిణి.. రెండు కిలోమీటర్ల నడక



మాటీ రహదారిలో నడుచుకుంటూ వస్తున్న గర్భవతి కనాక్ దెయి దురు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి కతాపల్లి పంచాయతీ బేదురుపల్లి గ్రామంలో ఆదివారం కనక్ దెయిదువ అనే నిండు గర్భిణి రెండు కిలోమీటర్లు మట్టి రోడ్డులో కాలినడకన వెళ్లి అంబులెన్స్‌ను చేరుకుంది. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో అంబులెన్స్‌ను కతాపల్లి కూడలి వరకు మాత్రమే వచ్చింది. దీంతో గర్భిణి రెండు కిలోమీటర్లు నడిచి అంబులెన్స్‌ను చేరుకున్నాక మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రూ.లక్షల విలువైన నకిలీ గుట్కా స్వాధీనం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు ఆదివారం బలిమెల పోలీసులు ఓ పూజా దుకాణం నుంచి రూ.లక్షల విలువైన నకిలీ గుట్కాలకు స్వాధీనం చేసుకున్నారు. చిత్రకొండ సమితి డైక్ 3 గ్రామానికి చెందిన ప్రశాంత్ పాత్రో బలిమెల డైలీ మార్కెట్‌లో ఓ పూజా సామగ్రి దుకాణాన్ని నడుపుతున్నాడు. లైసెన్స్ లేకపోవడంతో బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ ఆదివారం ఆ దుకాణం పై దాడి చేసి ప్రశాంత్‌ను అరెస్టు చేసి నకిలీ గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు.

నవీన్ పట్నాయక్‌ను కలిసిన ఎంపీ దంపతులు




నవీన్ పట్నాయక్‌తో ఎంపీ దంపతులు



నవీన్ పట్నాయక్‌తో ఎంపీ సంభాషణ

భువనేశ్వర్: స్థానిక పార్లమెంట్ సభ్యురాలు అపరాజిత షడంగి దంపతులు ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యం గురించి కుశల ప్రశ్నలతో సంభాషించారు. గతంలో జరిగిన అనేక సంఘటనలను ప్రేమగా గుర్తుచేసుకుని వీరివురి మధ్య సంభాషణ సంతోషకరంగా కొనసాగిందని ఎంపీ అపరాజిత షడంగి తెలిపారు. ఈ సమావేశం పరస్పర గౌరవం, సానుకూల రాజకీయాల స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. నవీన్ పట్నాయక్ వినయం మరియు రాజకీయ సరిహద్దులకు అతీతంగా జీవిస్తు రాష్ట్ర ప్రజలు మరియు ఆయన అధీనంలో పని చేసిన అధికారులు తదితర వర్గాల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించారు. భువనేశ్వర్ ఎంపీగా వరుసగా 2 సార్లు ఎన్నికై అధికారంలో కొనసాగుతున్న అపరాజిత షడంగి నవీన్ పట్నాయక్ హయాంలో రాష్ట్ర కేడర్ ఐఏఎస్ అధికారిగా తనదైన ప్రత్యేక శైలితో పలు అధికారిక, పాలనా పరమైన సంస్కరణలు ఆవిష్కరించి నవీన్ పట్నాయక్ ప్రసంశలు అందుకున్నారు. అధికారిక దక్షతతో ప్రజల ప్రేమ మరియు విశ్వాసాన్ని గెలుచుకున్న మహిళా అధికారిగా అపరాజిత షడంగి సరళత, నిజాయితీ మరియు సామాన్య ప్రజలతో సన్నిహిత సంబంధాలను సొంతం చేసుకున్నారు. సమ భావాలు కలిగిన ఈ ఇరువురు నాయకులు సమయోచితంగా సమావేశమై సంభాషించుకోవడం రాజకీయ విభేదాల కంటే మానవత్వం మరియు పరస్పర గౌరవాభిమానాలు విలువైనవని చాటి చెప్పారు.

మజ్జిగౌరి దర్శనానికి భక్తుల తాకిడి



పూజలందుకున్న మజ్జిగౌరి అమ్మవారు



క్యూలో వేచి ఉన్న భక్తులు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి మందిరానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ రెండు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి మందిరాన్ని ఉదయం తెల్లవారుజాము 3.30 గంటలకే మంగళహారతితో తెరుచుకోగా అప్పటి నుంచే భక్తులు క్యూలైన్‌లో బారులుదీరారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన 300 రుపాయల ప్రత్యేక దర్శనంలో కూడా రద్దీ బాగా కనిపించింది. ప్రత్యేక దర్శనం టిక్కెట్ తీసుకున్న భక్తులకు అమ్మవారి దర్శనం కోసం సుమారు మూడు గంటల సమయం పట్టింది. అయితే సాధారణ దర్శనం కోసం భక్తులు పడిగాపులు పడ్డారు. ఇదిలాఉండగా అమ్మవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల ఇబ్బందులు ఎదుర్కొని గత్యంతరం లేక ఆరుబయట మొక్కలు తీర్చుకుని వెళ్లాల్సి వచ్చింది.

స్వాతంత్ర్య సమరయోధుడు రాబిసింగ్ మజ్జికి నివాళులు



బట్టిబెడాలో రబిసింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రమేష్ మజ్జి



ఉమ్మర్‌కోట్‌లో నివాళులర్పిస్తున్న మంత్రి నిత్యానంద

కొరాపుట్: స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ రబిసింగ్ మజ్జి 103వ జయంతి కార్యక్రమం ఆయన స్వగ్రామం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ డివిజన్ బట్టిబెడా గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం రబిసింగ్ మంత్రి హోదాలో ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. గ్రామంలోని రబిసింగ్ విగ్రహానికి గ్రామస్తులతో కలసి నివాళులర్పించారు. ఉమ్మర్ కోట్ పట్టణంలో రబిసింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించగా.. స్థానిక మంత్రి నిత్యానంద గోండో తన అనుచరులతో సింగ్ విగ్రహానికి నివాళులఅర్పించారు.

పర్లాకిమిడిలో పల్స్‌పోలియో



పల్స్‌పోలియో కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీఎంఓ డాక్టర్ ఎంఎం ఆలీ



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చంటిపిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న డీఆర్‌డీఏ సీడీఎం శంకర్ కెరకెటా



చంటిపిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ రబినారాయణ దాస్

పర్లాకిమిడి: జిల్లా స్థాయి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రి మాతాశిశు ఆస్పత్రిలో ఆదివారం ఉదయం జిల్లా ముఖ్యచికిత్సాధికారి, డీహెచ్‌ఓ డాక్టర్ మహ్మద్ ముబారక్ ఆలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అన్ని ప్రాథమిక, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో రెండు చుక్కల పల్స్‌పోలియో కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, సోమ, మంగళవారాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పల్స్ పోలియో చుక్కలు చంటి పిల్లలకు వేస్తామని అన్నారు. పొరుగు దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లో పోలియో వ్యాధి ఎక్కువగా ఉన్నందున భారత్‌లో తిరిగి పల్స్‌పోలియో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.పి.యం. సరితా మహాపాత్రో ముఖ్యవక్తగా వ్యవహరించగా, జిల్లా పరిషత్తు ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఇతర అతిథులుగా డాక్టర్ రబినారాయణ దాస్, డాక్టర్ శంతను పాఢి, డీఎంఎస్‌ఎం ప్రణతి సాహు తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఎస్‌డీసీ నిధులు దారి మళ్లింపు

• ఎస్‌డీసీ మాజీ ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి



మాట్లాడుతున్న మాఝి, పక్కనే అనసూయ, జగన్నాథ సరక, సరస్వతి మాఝి

రాయగడ: ఆదివాసీల అభ్యున్నతికి, వారి భాష, సంసృతి, విధి విధానాలను పరిరక్షించేందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభివృద్ధి మండలి (ఎస్‌డీసీ) ఎంతగానో దోహదపడుతుండేదని ఎస్‌డీసీ మాజీ ముఖ్య సలహాదారుడు, మాజీ ఎంపీ ప్రదీప్ మాఝి అన్నారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎస్‌డీసీని రద్దు చేయడం విచారకరమన్నారు. రద్దయిన తరువాత రాయగడ జిల్లాలో ఎస్‌డీసీకి సంబంధించిన సుమారు 4 కోట్ల రుపాయల నిధులు దారిమళ్లాయని ఆరోపించారు. స్థానిక హోటల్ కైలాస్‌లో ఈ మేరకు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఆదివాసీ జిల్లాగా గుర్తింపు పొందిన రాయగడలో ఎస్‌డీసీకి మంజూరైన నిధులు దుర్వినియోగమయ్యాయన్నారు. రాయగడ జిల్లా కలెక్టర్‌గా వ్యవహరించే ఫరూల్ పట్వారీ, ఐటీడీఏ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ చంద్రకాంత్ మాఝి కుమ్మక్కై ఆదివాసీల అభివృద్ధి కోసం వచ్చిన నిధుల్లో సుమారు 4 కోట్ల రుపాయల నిధులు దారిమళ్లించారని ఆరోపించారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు చేయాలని, లేదంటే తాము ఆందోళన చేయడం ఖాయమని హెచ్చరించారు. ఆదివాసీ పిల్లల కోసం ఆట వస్తువులు కొనుగోలు చేసే విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఎస్‌డీసీని రద్దు చేసిన అనంతరం ఆ నిధులు ఏ విధంగా ఖర్చు చేశారో తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ మాజీ చైర్మన్ (రాయగడ) అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ మంత్రి జగన్నాథ సరక పాల్గొన్నారు.

క్లుప్తంగా

మల్కన్‌గిరిలో చిన్నారులకు చుక్కల మందు


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఐదేళ్ల చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 13, 14 తేదీల్లో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లాలోని ఏడు సమితుల్లో ప్రతి ఇంటికి వెళ్లి చుక్కలు వేయించుకోనివారిని గుర్తించి పోలియో డ్రాప్స్ వేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 752 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. 1504 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి బ్రోజబాల్ దాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జయపురం: జయపురం- బొరిగుమ్మ 26వ జాతీయ రహదారిలో ఉమ్మిరి గ్రామ సమీపంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గిడ్డంగుల సమీపంలో బైక్–కారు ఢీకొన్నాయి. శనివారం సాయంత్రం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వస్తున్న వ్యక్తి దుర్మరణం చెందాడు. మరణించిన వ్యక్తి జయపురం సమితి ఆంబాగుడ పోలీసు పంటి పరిధి మండాపాదర్ గ్రామ వాసి ధనపతి నాయక్(20)గా గుర్తించారు. మరణించిన వ్యక్తి శనివారం మధ్యాహ్నం తన బంధువును బైక్‌పై జయపురం తీసుకెళ్లాడు. అక్కడ నుంచి సాయంత్రం తన గ్రామానికి బయలు దేరివస్తున్నాడు. ఆ సమయంలో అతి వేగంగా వస్తున్న కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ధనపతి నాయక్ సంఘటనా స్థలం వద్దే మరణించాడు. ప్రమాదంలో అతడి తలకు బలమైన దెబ్బ తగలటంతో మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన అంబాగుడ పోలీసు సంటి పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం కొరాపుట్ జిల్లా కేంద్ర హాస్పిటల్ జయపురానికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఆదివారం పోస్టుమార్టం పూర్తయిన తరువాత మృత దేహాన్ని బంధువులకు పోలీసులు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి




సంతబొమ్మాళి: మండలంలోని లక్కీవలస పంచాయతీ గెద్దలపాడు గ్రామానికి చెందిన తుంబల చిరంజీవి (25) అనే మత్స్యకార యువకుడు శనివారం రాత్రి రాజమండ్రిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అక్కడ ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్న చిరంజీవి ఇటీవలే స్వగ్రామం వచ్చాడు. పది రోజుల కిందట తిరిగి రాజమండ్రి వెళ్లిపోయాడు. బైక్‌పై వెళ్తూ లారీని ఓవర్ టేక్ చేయబోయి అదే వాహనం కిందపడి మృతి చెందాడు. కుమారుడి మరణ వార్త విని తండ్రి గురువులు, తల్లి ఆదెమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పలాస: బారువ–మందస రైల్వేలైన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందినట్టు పలాస జి.ఆర్.పి ఎస్ఐ కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మృతుడి ఛాతిపై 'ఐ లవ్ యు స్వాతి' అని తెలుగులో రాసిన పుట్టుమచ్చ ఉందన్నారు. వివరాలు తెలిస్తే 9440627567 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

జాతీయ పోటీల్లో రాజశేఖర్ 'పవర్'



గార: కొర్ని గ్రామానికి చెందిన చమల్ల రాజశేఖర్ జాతీయ పోటీల్లో విజయదుందుభి మోగించాడు. ఇటీవల బెంగళూరులో జరిగిన నేషనల్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి శభాష్ అనిపించాడు. ఫుల్ పవర్‌లిఫ్టింగ్, పుష్‌పుల్, బెంచ్‌ప్రెస్ విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు సాధించాడు. గతంలోనూ ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలల్లో పతకాలు సాధించిన విషయం తెలిసిందే. యువ క్రీడాకారుడి ప్రతిభ పట్ల ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాధికారులు హర్షం వ్యక్తంచేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న ప్రసన్న రంజన్ నాయక్


పతంజలి రాందేవ్ బాబా యోగా సభ్యులు

పర్లాకిమిడి: మనస్సు ప్రశాంతంగా ఉంచుకుంటే మనకు ఎటువంటి అనారోగ్యాలు, చెడు ఆలోచన, వ్యసనాలు దరికి చేరవని ప్రభుత్వ మెడికల్ సిబ్బంది ప్రసన్న రంజన్ నాయక్ అన్నారు. స్థానిక శ్రీకృష్ణ చంద్ర గజపతి కళాశాలలో రాజగురు పతంజలి రాందేవ్ బాబా యోగా శిబిరంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసై నేరాలకు అలవాటు పడుతున్నారని ప్రసన్న రంజన్ నాయక్ అన్నారు. యోగా వల్ల మానసిక ప్రశాంత పొందవచ్చన్నారు. అక్టోబర్ 11 నుంచి నెలరోజుల పాటు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామని సతీష్ కుమార్ మహాపాత్రో అన్నారు. ఈ శిబిరంలో జతిన్ పట్నా, ప్రదీ కుమార్ మహాపాత్రో, పతంజలి యోగా శిబిరం గురువు కె.సూర్యనారాయణ, సురేంద్ర కుమార్ రథ్, ఇతర యోగా శిక్షకులు పాల్గొన్నారు.

రాణిపేట గ్రామంలో...

కాశీనగర్ బ్లాక్ రాణిపేట గ్రామంలో ఉన్న నియాతి మానసిక వికలాంగుల విద్యార్థుల పాఠశాలలో జిల్లా కోర్టు న్యాయ సేవా ప్రాధికరణ అధికారి బిమల్ రవులో పాల్గొని ప్రపంచ మానసిక ఆరోగ్యం దినోత్సవంపై మాటాల్డారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్‌కుమార్ మిశ్రా, జిల్లా నియాతి స్కూల్ అధ్యక్షురాలు స్వయంలతా పాణిగ్రాహి, తనూజా శతపథి తదితరులు పాల్గొని మాట్లాడారు.


రాణిపేట నియాతి వికలాంగుల సంస్థలో పాల్గొన్న బిమల్, విద్యార్థులు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో.. బొరిగుమ్మ యువతి


ఎస్.త్రిషా తన్య

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ యువతి ఇండియా బుక్ ఆఫ్ రికార్స్ 2025లో స్థానం సంపాదించింది. ఇంగ్లీష్ పుస్తకాలు రచించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొంది అందరి ప్రశంసలు పొందుతోంది. యువతి బొరిగుమ్మ సమితి నువాగాం గ్రామంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.రాజేష్ కుమార్, గాయత్రీల కుమార్తె ఎస్.త్రిషా తన్య. త్రిషా 19 ఏళ్ల వయసులో 'ఎ నోట్ వాట్ ఐ థాట్', 'సెంటిమెంట్స్ ఆఫ్ ఎడల్‌సెంట్', 'డిజైన్ డెజిరబుల్ డిపిక్షన్' పుస్తకాలను ఇంగ్లీష్‌లో రచించింది. ఆ రచనలకు సంతృప్తి చెందిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డు వారు ఆ బాలిక ప్రతిభకు మెచ్చి రికార్డ్స్‌లో స్థానం కల్పించి ప్రశంసా పత్రం, మెడల్, ఇండియ బుక్ ఆఫ్ రికార్డ్స్ పుస్తకం, పెన్, బ్యాడ్జ్, గుర్తింపు కార్డ్‌తో సన్మానించారు. ఎస్.త్రిషా తన్య జయపురం విక్రమదేవ్ విశ్వ విద్యాలయలో +3లో ఆఖరి సంవత్సర చదువుతోంది. భవిష్యత్తులో తాను మరికొన్ని పుస్తకాలు ఆంగ్లంలో రాయనున్నట్లు త్రిషా వెల్లడించింది. ఆమెను తోటి విద్యార్థులు, స్నేహితులు, బంధువులు, బొరిగుమ్మ ప్రజలు అభినందించారు. మరిన్ని పుస్తకాలు రచించి మంచి ఆంగ్ల రచయితగా పేరు తెచ్చుకోవాలని ఆకాక్షించారు.

11 అడుగుల కొండచిలువ పట్టివేత


11 అడుగుల కొండచిలువ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి టెల్‌రాయి పంచాయతీ ఎం.వి.107 గ్రామంలో 11 అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. శనివారం రాత్రి గ్రామానికి చెందిన సురెం గుప్తా వ్యక్తి ఇంటి పెరట్లోని అరటి చెట్టు వద్ద ఉన్న పామును పక్కింటి మహిళ చూసి కేకలు వేసింది. దీంతో సురెం గుప్తా కలిమెల స్నేక్‌హెల్ప్ లైన్ సభ్యుడు రాకేష్ హల్దర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన తన సహచారుడుతో వచ్చి కొండచిలువను పట్టుకున్నారు. అటవీశాఖ సిబ్బంది సూచన మేరకు ఆదివారం ఉదయం ఎం.వి.126 గ్రామ అడవిలో విడిచిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాద స్థలంలో డొంబురు బిసోయి మృతదేహం


ప్రమాద స్థలంలో ఉన్న బైక్

కొరాపుట్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి కక్కిరిగుమ్మ వెళ్లే మార్గంలో చంపుర రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. లక్ష్మీపూర్ సమితి కుసుం గుడ గ్రామానికి చెందిన డొంబురు బిసోయి (53) బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో డొంబురు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వ్యాపారం పనిపై వెళ్తూ మృత్యువాత పడ్డాడని గ్రామస్తులు పేర్కొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆర్.బెలగాం యువకుడి ప్రతిభ


మహారాష్ట్ర సీఎం చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న సుమిత్‌కుమార్

కవిటి: ఆర్థిక రాజధాని ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో భారత్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ క్వెస్ట్–2025లో కవిటి మండలం ఆర్.బెలగాం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ రత్నాల సుమిత్‌కుమార్ సత్తాచాటాడు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీలో బ్యాంక్ లావాదేవీలు, పేమెంట్ డేటా, రియల్ టైమ్ ఫ్రాడ్ డిటెక్షన్ తదితర సమస్యల పరిష్కారంపై ఆన్‌లైన్ టెస్ట్, కోడ్ అండ్ డేటా సైన్స్ చాలెంజ్, అడ్వాన్స్‌డ్ ఏఐ వర్క్ షాప్ తదితర విభాగాల్లో సుమిత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా మహారాష్ట్ర సీఎం చేతుల మీదుగా రూ.5 లక్షల నగదు, అవార్డు శనివారం అందుకున్నారు. రత్నాల కామేశ్వరరావు, ప్రమీల దంపతుల కుమారుడు సుమిత్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేఎంఐటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. యువకుడి విజయం పట్ల కవిటి మండల సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండవ రామారావు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో ఉన్మాది హల్‌చల్


ఉన్మాదిని కొడుతున్న ప్రజలు

- కత్తి పట్టుకొని పలువురిపై దాడి
- ఇద్దరికి తీవ్రగాయాలు
- మోహన్ కుమార్ నాయక్‌ను అరెస్టు చేసిన పోలీసులు

జయపురం: జయపురం బెడ సాహిలో తాగుబోతు(ఉన్మాది) కత్తి పట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు. ఆ ప్రాంత ప్రజలు అతి కష్టంతో అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తి ఆ ప్రాంతంలో గల గంగా మా మందిరంలో దేవీ పూజా స్థలంలో గల దేవి ఖడ్గాన్ని తీసుకువచ్చాడు. ఆ ప్రాంతంలో ఉన్నవారిపై కత్తితో దాడి చేస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలిసిన పట్టణ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. పోలీసులు అతడిని పట్టుకొనేందుకు ప్రయత్నించగా పోలీసులపైనా దాడి చేశాడు. పోలీసులు అతడిని పట్టుకునే సమయంలో ఉన్మాది కిందపడ్డాడు. ఆ సమయంలో ప్రజలు అతడిని పట్టుకున్నారు. పోలీసుల సహకారంతో గంట సమయం ఆ ఉన్మాదిని పట్టుకొనేందుకు శ్రమించిన ప్రజలు అతడికి దేహశుద్ధి చేశారు. ఉన్మాది వ్యక్తి మోహన్ కుమార్ నాయక్(44) అని పోలీసులు వెల్లడించారు. అతడు మద్యం తాగి ఉన్మాదంతో గత రాత్రి ఇంటిలో భార్య, కుమార్తెను కొట్టాడని ఆ వీధి వాసులు వెల్లడించారు. గత రెండు రోజులుగా ఆ తాగుబోతు వీధిలో భయభ్రాంతులను చేస్తున్నాడని ఆరోపణ. అతడి దాడిలో సింహాచల గంతాయిత్, చిన్మయ సాహు గాయపడినట్లు ప్రజలు వెల్లడించారు. జయపురం పట్టణ పోలీసులు అతడిని స్టేషన్‌కు తీసుకువచ్చారు. నాయక్ తాగుబోతు కావటం వలన అతడు మతిస్థిమితం కోల్పోయి ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నాడని అతడి కుటుంబ సభ్యులు వెల్లడించారు.

డిజిటల్ మారథాన్‌కు రెడీ

- 'ఆంధ్రా యువ అంబాసిడర్' ఎంపికలకు పోటీలు
- షార్ట్‌వీడియోలకు ఆహ్వానం
- విజేతలకు భారీగా నగదు బహుమతులు

శ్రీకాకుళం న్యూకాలనీ :

వికసిత్ భారత్ – 2047 లక్ష్యాలను సాధించేలా యువతను ఆకర్షించేందుకు యువజన సర్వీసుల శాఖ నడుంబిగించింది. దీనిలో భాగంగా సామాజిక, కుటుంబ సంబంధాలతోపాటు ఆరోగ్యకరమైన జీవన వైవిధ్యాన్ని తెలియజేస్తూ డిజిటల్ ఆవిష్కరణల విలువలను ప్రోత్సహించి ప్రజలను మేల్కొలిపేలా షార్ట్‌వీడియోను తయారు చేసేందుకు యువతకు అవకాశం కల్పించారు. ఇందులో విజేతలకు ఆంధ్ర యువత అంబాసిడర్‌గా ప్రకటించడంతో పాటు భారీగా నగదు ప్రోత్సాహకాలను అందజేయనున్నారు. ఈ మేరకు 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కే25 (ఆంధ్ర యువ 2కే25 అంబాసిడర్)' డిజిటల్ మారథాన్‌లో యువత భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిస్తున్నారు.

ఎలా పాల్గొనాలంటే..

- ఆంధ్ర యువ అంబాసిడర్ పోటీల్లో పాల్గొనేందుకు 18 నుంచి 35 ఏళ్ల యువతీ యువకులు అర్హులు.
- 'ఆంధ్రాయువసంకల్ప్.కామ్' వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేరుకోవాలి. ఇందుకు ఈ నెల 15తో గడువు ముగియనుంది.
- పోటీల్లో పాల్గొనేవారు 120 సెకన్ల నిడివిగల వీడియో/షార్ట్‌ను తయారుచేసి, నిర్దేశిత అధికారిక హ్యాష్‌ట్యాగ్‌లతో వారి సొంత సోషల్ మీడియా ఖాతాలలో (ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ షార్ట్స్ మొదలైనవి) పోస్ట్ చేయాలి.
- జ్యూరీ కమిటీ తమకు వచ్చిన ఎంట్రీలను సమీక్షించి విజేతలను ప్రకటిస్తుంది.

ఆంధ్ర యువసంకల్ప్ 2కే25 లోగో

బహుమతులు, సర్టిఫికెట్లు..

అంబాసిడర్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.1,00,000, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75,000, తృతీయ స్థానంలో నిలిచినవారికి రూ.50,000 నగదు బహుమతులు అందజేస్తారు. మొదటి తొమ్మిది మంది విజేతలకు 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కే25 అంబాసిడర్'గా గౌరవ సత్కారం అందజేస్తారు. పోటీలలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికీ డిజిటల్ క్రియేటర్ ఏపీ 2కే25 పేరిట సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

గొప్ప అవకాశం..

యువత తమలో ఉండే సృజనాత్మకతను నిరూపించుకునేందుకు చక్కటి అవకాశం. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా వివిధ అంశాల్లో ప్రజలను మేల్కొలిపేలా వీడియోను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేసన్ చేసుకున్నవారి వీడియోలను జ్యూరీ కమిటీ పరిశీలించి ఎంపికచేస్తుంది.

– వావిలపల్లి వెంకటప్పలనాయుడు, సెట్‌శ్రీ సీఈఓ

ప్రతిభ నిరూపించుకోవాలి..

జిల్లా యువత అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. టాలెంట్ నిరూపించుకునేందుకు ఇదొక చక్కటి అవకాశం. డిజిటల్ మారథాన్‌లో పాల్గొని ప్రతిభ చాటుకోవాలి. అత్యధిక మంది భాగస్వాములై శ్రీకాకుళం జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలి.

– కె.వెంకట్ ఉజ్వల్, మేరాభారత్ డిప్యూటీ డైరెక్టర్

మీకు తెలుసా?

అరసవల్లిలో భగళాముఖి అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్ : ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి కొలువుదీరిన అరసవల్లిలోనే భగళాముఖి అమ్మవారు ప్రత్యేకంగా పూజలందుకుంటున్నారు. ప్రస్తుత తరంలో చాలామందికి ఈ విషయం తెలియదనే చెప్పాలి. సూర్యనారాయణ స్వామి ఆలయంలో మూలవిరాట్ మందిరానికి ఆనుకొని ఉన్న దుర్గాదేవిని భగళాముఖి అమ్మవారుగా పిలుస్తారు. ప్రత్యక్ష నారాయణుని దర్శించుకున్న తరువాత బయటకు వస్తే మనకి తీర్థం ఇచ్చి శఠగోపం పెడతారు. అక్కడే ఈ అమ్మవారు కొలువుదీరారు. భగళాముఖి అమ్మవారికి ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వారే జలుమూరులో కొండపైన ఉన్న ఇంద్రాణి అమ్మవారు, శ్రీముఖలింగంలో వారాహి అమ్మవారు. అరసవల్లిలో శక్తిస్వరూపిణిగా ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు, నిత్యపూజలు అందుకుంటారు.

పంచాయతన ఆలయంగా అరసవల్లి..

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని పంచాయతన ఆలయంగా పిలుస్తారని మీకు తెలుసా!. ఎందుకంటే అక్కడ ఆదిత్యుడు, అంబిక, విష్ణు, గణనాథుడు, మహేశ్వరుడు కలసి ఉన్నారు. అందుకే ఈ ఆలయాన్ని పంచాతయన ఆలయంగా కొలుస్తారనిప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఆదిత్యుడికి రథసప్తమి వేడుకలు, ఈశ్వరుడికి శివారాధన, శివరాత్రి, కార్తీక మాస ఉత్సవాలు జరుగుతాయి. వినాయకుడికి గణపతి ఉత్సవాలు, నిత్య పూజలు నిర్వహించారు. విష్ణుతత్వంగా మార్గశిర మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఇలా అనేక ప్రత్యేకతలతో అరసవల్లి ఆదిత్యాలయం విరాజిల్లుతోంది.



కాసులు కురిపిస్తున్న పీచు

- టన్ను పీచు ధర రూ.10 వేలు నుంచి రూ.20 వేలు
- ఉద్దానం నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు
- కొబ్బరి పీచు, తాళ్లకు డిమాండ్


పెద్దమురహరిపురంలో ఉన్న పీచు పరిశ్రమ

వజ్రపుకొత్తూరు: కోనసీమ తర్వాత కొబ్బరి చెట్లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఉద్దానంలో ఉత్పత్తి అవుతున్న కొబ్బరిపీచుకు మంచి గిరాకీ ఉంటోంది. ఇక్కడి పరిశ్రమల్లో తయారైన పీచు, తాడు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు భారీ ఎత్తున ఎగుమతి అవుతోంది. పొరుగునే ఉన్న విజయనగరంతో పాటు హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు వంటి రాష్ట్రాలకు పీచు, తాడు ఉత్పత్తులు పంపిస్తున్నారు. జిల్లాలో అటు రణస్థలం నుంచి ఇటు ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, మందస, సంతబొమ్మాళి, పలాస తదితర 29 మండలాల్లో 15 వరకు పీచు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ రోజుకు 120 టన్నుల వరకు పీచు ఉత్పత్తి జరుగుతోంది.

తయారీ ఇలా..

జిల్లాలో 32,602 ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తుండగా నెలకు సరాసరి 32,60,000 కాయలు దిగుబడి వస్తున్నాయి. కొబ్బరికాయల డొక్కలు 30 శాతం వృథాగా పోతుండగా.. పరిశ్రమ నిర్వాహకులు అవసరమైన డొక్కలను రైతుల నుంచి కొనుగోలు చేసి లారీలతో తరలిస్తున్నారు. వీటిని పరిశ్రమల్లో పెద్ద లాట్‌లుగా కట్టి పది, పదిహేను రోజులు నీటితో తడుపుతారు. అనంతరం డీసెండికేటర్‌లో కొబ్బరి డొక్కలు వేస్తే పీచులా మారుతుంది. దానిని ఎండ బెట్టి ఎగుమతులకు సిద్ధం చేస్తారు. కర్లింగ్ పీచు కొనుగోలు చేసుకుని కర్లింగ్ మెషీన్‌ల ద్వారా రెండు రకాల తాడును తయారు చేస్తారు. ప్రస్తుతం పీచు ధర టన్ను రూ.10వేలు ఉంది. కర్లింగ్ పీచుకు రూ.20 వేలు ధర లభిస్తోంది. 2014 వరకు కొబ్బరి పీచును చైనాకు అధికంగా ఎగుమతి జరిగేది. ఐతే పరుపుల తయారీకి ఫోం అందుబాటులోకి రావడంతో పీచుకు డిమాండ్ తగ్గింది. దేశీయంగా మాత్రం వినియోగం పెరిగింది. వినాయకుడు, దేవీ విగ్రహాల తయారీలో దేశ వ్యాప్తంగా కొబ్బరి పీచునే వినియోగిస్తుండటంతో గిరాకీ పెరుగుతోంది.

బోట్లు, ఇటుకలు తయారీకిలోనూ..

ప్రధానంగా బోట్లు తయారీలో కొబ్బరి పీచు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్, కొబ్బరి పీచును వినియోగించి బోట్లు రూపొందిస్తారు. విశాఖ, కాకినాడ, చెన్నై, ముంబై, కోల్‌కత్తా, కేరళ తదితర ప్రాంతాల్లో చేపల బోట్లతో పాటు రవాణా, టూరిజం బోట్ల తయారీలో కొబ్బరి పీచు వినియోగిస్తారు. పీచు తయారీలో పొట్టు కూడా వస్తుంది. దీనిని కంపోస్టు, ఇటుకల తయారీలో వినియోగిస్తున్నారు. ఫ్యాక్టరీల వద్దే నేరుగా కంపోస్టు ఎరువు తయారు చేసి నర్సరీలకు ఎగుమతి చేస్తున్నారు. కంపోస్టు ఎరువు టన్ను రూ.5వేలు ధర పలుకుతోంది. ఇటుకల బట్టీల్లోనూ పొట్టు వినియోగిస్తున్నారు. దీని వల్ల ఇటుక తేలికగా ఉంటోంది. ఈ ఇటుక అపార్టుమెంట్ల నిర్మాణంలో బాగా ఉపయోగపడుతోంది. ట్రాక్టర్ లోడుకు రూ.7వేలు ధర లభిస్తోంది.


కర్లింగ్ పీచుకు డిమాండ్..



ఇటీవలే పీచు పరిశ్రమ ప్రారంభించాను. కర్లింగ్ పీచుకు డిమాండ్ ఉంది. అయితే మార్కెట్‌పై పూర్తి స్థాయిలో అవగాహన లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాయిర్ బోర్డు పీచు పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి మార్కెట్ సౌకర్యం మార్గాలను చూపించాలి. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలి.


– కె.దేవదాసు, పీచు పరిశ్రమ నిర్వాహకుడు, పెద్దమురహరిపురం

యువత దృష్టి సారించాలి..



ఉద్దానం ప్రాంతంలో పెద్ద ఎత్తున కొబ్బరి డొక్కలు ఉత్పత్తి అవుతున్నా అందుకు తగ్గస్థాయిలో పరిశ్రమలు లేవు. ఔత్సాహికులు ముందుకు వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కాయిర్ బోర్డు ద్వారా 35 శాతం సబ్సిడీతో రుణాలు పొందే అవకాశం ఉంది. నిరుద్యోగ యువత ఈ పరిశ్రమలపై దృష్టి సారించాలి. ఇచ్ఛాపురం కొబ్బరి పొట్టుతో ఇటుకలు తయారు చేసే పరిశ్రమ సైతం ఉంది. మంచి లాభాలు సైతం ఆర్జిస్తున్నారు. కాయిర్ బోర్డు, మా సహకారం తీసుకుని ముందుగా దీనిపై అవగాహన పెంచుకుని నాబార్డు, ఇతర సంస్థలు ద్వారా రుణాలు పొంది పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి.

– సీహెచ్.శంకర్‌దాసు, ఉద్యానవన శాఖ అధికారి , పలాస


కర్లింగ్ పీచును వేరు చేస్తున్న యంత్రం


ఇటుకల పరిశ్రమకు ఎగుమతికి సిద్ధంగా ఉంచిన పొట్టు

క్లుప్తంగా

బంగారం చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గంట్యాడ: మండలంలోని కరకవలస పరిధి జగదాంబ నగర్‌లో తులం ముప్పావు బంగారం చోరీకి గురైంది. జగదాంబనగర్‌లో నివాసముంటున్న కుప్పిలి శ్రీరామమూర్తి ఇంట్లో శనివారం రాత్రి ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం విరగ్గొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న ఒక్కటిన్నర తులాల గొలుసు, పావు తులం ఉంగరం ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి. సాయి కృష్ణ తెలిపారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు అమ్మాయిలు ఆదివారం అదృశ్యమయ్యారు. ఇందుకు సంబంధించి ఏఎస్సై రామలక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అయ్యన్నపేటకు చెందిన అన్నదమ్ముల పిల్లలు ఇద్దరు (23) శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. డిగ్రీ చదివిన ఇద్దరూ స్నేహితుల వద్దకు వెళ్లిఉంటారని వారి తల్లిదండ్రులు ఆదివారం మధ్యాహ్నం వరకు వేచి చూశారు. అమ్మాయిలిద్దరూ ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అన్నదమ్ములిద్దరూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వకు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ ఆర్వీఆర్‌కే.చౌదరి ఆదేశాలతో ఏఎస్సై రామలక్ష్మి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థినికి గాయాలు


బాధిత విద్యార్థిని నుంచి వివరాలు సేకరిస్తున్న ట్రైనీ ఎస్సై

పాలకొండ రూరల్: స్థానిక ఎన్‌కే.రాజపురం ప్రాంతానికి చెందిన టి.యామిని అనే విద్యార్థిని పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన ఆ విద్యార్థిని తిరిగి ఇంటికి వె వెళ్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలైంది. ఈ ఘటనపై బాధిత విద్యార్థిని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరయ్యేందుకు పాఠశాలకు ఆమె చేరుకోగా ఆ సమయంలో సహ విద్యార్థులు రాకపోవడంతో తిరిగి ఇంటికి బయల్దేరింది. ఆ సమయంలో పాఠశాల రహదారిలో ఎదురుగా వస్తున్న వాహనం నుంచి తప్పుకోబోతున్న క్రమంలో అక్కడి ప్రహరీ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలడంతో షాక్‌కు గురైంది. ఈ క్రమంలో స్థానికులు గమనించి విద్యార్థినిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. షాక్ కారణంగా గాయాలు కావడంతో వైద్యు ప్రథమ చికిత్స అందించటంతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థిని అందించిన వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


సంతోష్ (ఫైల్)

లక్కవరపుకోట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కుటుంబ పోషణ భారం కావడంతో మండలంలోని చందులూరు గ్రామానికి చెందిన కొటాన సంతోష్(26) మనస్తాపం చెందిన గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై ఎస్సై నవీన్‌పడాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతోష్ విశాఖపట్నంలోని ఒక సంస్థలో అవుట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. తనకు వచ్చిన జీతం సరిపోక కుటుంబాన్ని పోషించుకోవడం భారమవడంతో శనివారం సాయంత్రం తన ఇంటి వద్ద గడ్డిమందు తాగేశాడు. దీంతో అపస్మారక స్థితిలో పడి ఉన్న సంతోష్‌ను కుటుంబసభ్యులు గుర్తించి ఎస్.కోట సీహెచ్‌సీకి, అక్కడి నుంచి విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.ఈ మేరకు మృతుడు తండి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

వంగర: మండల పరిధిలోని తలగాం గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన వై.రవికి గాయం కావడంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. అలాగే తన ఇంటికి వచ్చి దుర్భాషలాడి కొట్టినట్లు మహిళ జి.దేవి ఇచ్చి ఫిర్యాదు మేరకు వై.రవిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆహ్లాదం మాటున విషాదం

- పక్షం రోజుల్లో ప్రారంభం కానున్న పిక్‌నిక్‌లు
- పర్యాటకులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదమే
- ఘాట్‌రోడ్లలో మలుపుల వద్ద ప్రమాదాలు
- అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోని పర్యాటకులు


జగతపల్లి వ్యూపాయింట్

సీతంపేట: మరో పక్షం రోజుల్లో పిక్‌నిక్‌ల సీజన్ ఆరంభం కానుంది. ఈ సమయంలో పర్యాటకులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉంది. ముఖ్యంగా పర్యాటకులను కట్టిపడేసే అందమైన వ్యూపాయింట్లు చూడడానికి సీతంపేట ఏజెన్సీకి వస్తున్న టూరిస్టులు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదం పొంచి ఉంటుంది. జగతపల్లి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో జగతపల్లి మలుపు వద్ద ఇప్పటి వరకు ఇద్దరు, ఆడలి వ్యూపాయింట్ మార్గంలోని వెల్లంగూడ సమీపంలో మలుపుల వద్ద నలుగురు మృతిచెందారు. ఆరుగురు మృతిచెందగా 30 నుంచి 40 మంది వరకు క్షతగాత్రులై ఆస్పత్రి పాలయ్యారు. పర్యాటకుల ప్రాణాలు ఘాట్‌రోడ్లు హరిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

జగతపల్లి వ్యూపాయింట్‌ను పరిశీలిస్తే..

సీతంపేట ఏజెన్సీలో సుమారు రూ.7 కోట్ల అంచనా వ్యయంతో జగతపల్లి వ్యూ పాయింట్‌ను అభివృద్ధి చేయదలిచారు. వాటిలో ఇప్పటి వరకు వ్యూపాయింట్ నిర్మించారు. ఇంకా రిసార్ట్ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇక్కడి నుంచి చూస్తే ఏజెన్సీలో పలు గ్రామాలు, పచ్చని కొండలు, ఎంతో అందంగా కనిపిస్తాయి. ఇక్కడి వ్యూ పాయింట్‌కు సీతంపేట నుంచి దోనుబాయి రోడ్డుకు వెళ్లే మార్గంలో దేవనాపురం మీదుగా జగతపల్లి వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ రోడ్డులో పెద్ద పెద్ద మలుపులు ఉన్నాయి. మలుపులు దాటుకుంటూ వెళ్లాలి. ప్రస్తుతం ఆడలి అంత ప్రాచుర్యం జగతపల్లికి లేదని చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం ఇంకా ఐటీడీఏ ఆధ్వర్యంలో పర్యాటక పరంగా నిర్వహించడం లేదు. టిక్కెట్ల ధరలు, ఫొటోషూటింగ్, క్యాంటీన్‌ల వంటివి ఏర్పాటు చేయలేదు. అప్పుడప్పుడు పర్యాటకులు వచ్చి వెళ్తుంటారు.

కొన్నాళ్లుగా జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే..

జగతపల్లి వ్యూపాయింట్ నుంచి తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి మూడేళ్ల క్రితం ఏఆర్ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతిచెందారు. కొద్దిరోజుల కిందట పాలకొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయికృష్ణ ఇదే ఘాట్‌రోడ్‌లో ద్విచక్ర వాహనం స్కిడ్ అయి మృతిచెందారు. ఇక ఆడలిలో 8నెలల కిందట పాలకొండలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన భారతి తన భర్త, పిల్లలతో కలిసి వ్యూపాయింట్ అందాలు చూసి ఇంటికి వెళ్తుండగా వెల్లంగూడ మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయింది. ఈఘటనలో ఆమె మృతిచెందగా మిగతా వారికి గాయాలయ్యాయి. అ ఘటన మరువకముందే శ్రీకాకుళానికి చెందిన ఓ కుటుంబం ఆటోలో ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లి మార్గమధ్యంలోని మలుపువద్ద అక్కడి లోయలోకి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సుమారు 10 మంది గాయపడ్డారు. అప్పటికి కొద్దిరోజుల్లోనే పిక్నిక్‌కు వెళ్లిన మరో కుటుంబం సవర గొయిది సమీపంలో డౌన్ దిగుతుండగా పక్కన ఉన్న గట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అనంతరం ఆడలి వ్యూ పాయింట్ నుంచి దిగి వస్తున్న ఆటోను దాని వెనుక నుంచి వస్తున్న మరో ఆటో ఢీకొట్టగా ముందు ఆటో చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. వారిలో బూర్జమండలం కురుంపేటకు చెందిన బొడ్డు యశోదమ్మ, వెల్లంగూడకు చెందిన సవర రెల్లయ్య మృతిచెందారు. అలాగే మే 20న సీతంపేటకు చెందిన గిరజాల వేణుమాధవ్ వెల్లంగూడ మలుపు వద్దకి వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుతప్పి లోయలో పడడంతో మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి.


ఆడలి వ్యూపాయింట్


సవరగొయిది వద్ద గట్టు ఢీకొట్టిన మ్యాక్సీక్యాబ్ (ఫైల్)


వెల్లంగూడ ఘాట్‌రోడ్ వద్ద నిర్మిస్తున్న రక్షణగోడ

ఆడలి వ్యూపాయింట్ పరిస్థితి ఇది..

ఆడలి వ్యూ పాయింట్‌ను అన్ని విధాలా తీర్చిదిద్దారు. సీతంపేట- పాలకొండ మధ్య ఉన్న కుశిమి జంక్షన్ నుంచి 6 కిలోమీటర్ల మేర సాగే ప్రయాణంలో దారి మధ్యమధ్యలో వచ్చే ప్రతి మలుపులో ప్రకృతి అందాలు అటువైపుగా వెళ్లే వారిని కట్టిపడేస్తాయి. ఇక వ్యూపాయింట్ వద్దకు వెళ్లే సరికి మంచుపొరలు, చల్లనిగాలి వంటి రమణీయత ఆహ్లాదాన్ని పంచుతాయి. ఘాట్‌రోడ్‌లో ఉండే మలుపులే సందర్శకులను భయపెడుతున్నాయి. ఇటీవల ఆడలి వ్యూపాయింట్ వద్ద ఉన్న రక్షణగోడకు ఉన్న బండరాళ్లు పక్కనే ఉన్న క్యాంటీన్‌పై పడిపోగా క్యాంటీన్‌లో ఉన్న నలుగురు వ్యక్తులు పరుగులంకించారు. తాజాగా సీతంపేట ఏజెన్సీలో పర్యటించి నూతన కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆడలి వ్యూపాయింట్‌ను సందర్శించారు. ఇక్కడ ఎకోటూరిజంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అవగాహన కల్పించినా కానరాని ఫలితం

పోలీసుల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఘాట్ రోడ్లలో జరిగే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ వద్దని సూచించినా కొందరు టూరిస్టులు అవేవీ పట్టించుకోకుండా వ్యవహరించడం మూలాన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో రూ.కోటి వ్యయంతో మలుపుల వద్ద రక్షణ గోడలు నిర్మిస్తున్నారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జాగ్రత్తలు తప్పనిసరి

వ్యూపాయింట్‌లకు వెళ్లే పర్యాటకులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదముంది. ఘాట్‌రోడ్‌లో వాహనాలతో దిగేటప్పుడు జాగ్రత్త వహించాలి. న్యూట్రల్‌లో కాకుండా గేర్‌లో రావాలి. ఆడలి, జగతపల్లి వైపు వెళ్లే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి.

వై.అమ్మన్నరావు, ఎస్సై, సీతంపేట

ఉపాధిహామీ పనుల్లో అవకతవకల గుర్తింపు


చినంకలాంలో జరుగుతున్న గ్రామ సభ


గ్రామసభలో ఒకరినొకరు తోసుకుంటున్న గ్రామస్తులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులు, బిల్లుల చెల్లింపు, మస్తరు వేయడంలో అవకతవకలు జరుగుతున్నాయా? లేదా? అనే అంశంపై సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో చినంకలాంలో రామమందిరం వద్ద సర్పంచ్ పి.తిరుపతిరావు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామసభ జరిగింది. మధ్యాహ్నం గ్రామసభ ప్రశాంతంగా ప్రారంభించినప్పటికీ క్షేత్ర సహాయకుడు బి. సత్యనారాయణ సమక్షంలో జాబ్ కార్డులు, ఉపాధి పనులుకల్పిం చడం, బిల్లుల చెల్లింపులపై వేతనదారులను సామాజిక తనిఖీ బృందం అడిగి తెలుసుకున్న సమయంలో వివిధ రకాల అభియోగాలు బయటపడ్డాయి. దీర్ఘ కాలంగా గ్రామాంతరం వెళ్లిన వారికి పనుల్లో పాల్గొనక పోయినా మస్తరు వేశారని, గర్భిణులు ప్రసవ సమయంలో పనుల్లో పాల్గొనక పోయినా, ప్రభుత్వం వద్ద గౌరవ వేతనం తీసుకుంటున్న వారికి, అనారోగ్యానికి గురైన వృద్ధులు ఏళ్ల తరబడి మంచాన పట్టిన వారికి, ఒకే ఇంట్లో ఉన్న భార్యాభర్తలు వేర్వేరు జాబ్‌కార్డులు పొంది వేతనాలు పొందినట్లు సామాజిక తనిఖీ సిబ్బంది గుర్తించారు. సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామసభ నిర్వహించే సమయంలో గ్రామస్తులు ఒకరిపై ఒకరు అభియోగాలు చేసుకోవడం గొడవలకు దారితీసింది. దీంతో గ్రామంలోని రెండు వర్గాలు తోపులాటకు దిగాయి. ఈ విషయమై డీఆర్పీ గుంపస్వామి వద్ద ప్రస్తావించగా విజయవాడ, హైదరాబాద్, రాజమండ్రి తదితర దూర ప్రాంతాల్లో ఉన్నవారికి, వృద్ధులకు, గర్భిణులకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలు పొందుతున్న వారికి ఉపాధిహామీ బిల్లులు చెల్లించినట్లు గ్రామసభలో గుర్తించామన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేయనున్నట్లు చెప్పారు.

ఉపాధిహామీలో ఇంజినీర్ల పాత్ర కీలకం

- పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


సమావేశంలో మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు షేక్ రియాజ్


రాష్ట్ర నాయకులకు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా అసోసియేషన్ సభ్యులు

విజయనగరం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ల పాత్ర కీలకమని పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి అన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్‌లో ఇంజినీరింగ్ విభాగం పాత్రను మరింత బలోపేతం చేయడం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఎదురవుతున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బంది సర్వీస్ రూల్స్ రూపకల్పన, సవరణలకు సంబంధించిన సూచనలు, ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల సమస్యలను పరిష్కరించడమే అసోసియేషన్ లక్ష్యమన్నారు. గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని, ప్రతి సభ్యుడు సమాజ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జి.వెంకటరెడ్డి, విజయనగరం జిల్లా అధ్యక్షుడు యు.సోములు, కార్యదర్శి కె.ప్రసాద్, కోశాధికారి వి.నీరజ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి నిలయంగా ఆర్వోబీ


వంతెనపై గోతిలో పడి మొరాయించిన వాహనం


వంతెనపై ప్రాణాలు తీస్తున్న స్థలం ఇదే


గోతులు వారిన బ్రిడ్జి రోడ్డు


బీటీ రోడ్డుపై గోతిని తప్పించ బోయి కాశీపేట వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఎద్దు (ఫైల్)

సీతానగరం: మండలంలోని వాహన చోదకులు రోడ్డెక్కితే ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిపై నిరంతరం పార్వతీపురం, బొబ్బిలి మీదుగా రోజూ వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. మార్గమధ్యంలో రోడ్డు, వంతెనపై భారీ స్థాయిలో గోతులు ఏర్పడడంతో నెల రోజులుగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతుల్లో వాహనాలతో జరుగుతున్న ప్రమాదాల్లో నిండు ప్రాణాలు పోతున్నా ఇంతవరకూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రోడ్డు ప్రమాదాలను చూస్తున్న పోలీసులు కొంతమేర గోతులు పూడ్చుతున్నా వర్షాలు, భారీ వాహనాలు వందల సంఖ్యలో మరమ్మతుల సమయంలో తిరుగాడడం వల్ల ఫలితం లేక పోతోంది. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'బుచ్చి అప్పారావు' విగ్రహం ఏర్పాటులో రాజకీయం..!

- విగ్రహావిష్కరణలో విభేదాలు, వసూళ్ల వివాదం

విజయనగరం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరుతో గంట్యాడ మండలంలోని తాడిపూడి రిజర్వాయర్ ప్రాంతంలో సోమవారం జరుగనున్న విగ్రహ ఆవిష్కరణ రాజకీయ రంగుదాల్చింది. తూర్పు కాపు-కొప్పుల వెలమ సంఘాల మధ్య విభేదాలు, పాత ప్రభుత్వాల నిర్ణయాలపై కొత్త పాలకుల వైఖరి, చందాల వసూళ్ల వివాదం ఈ కార్యక్రమాన్ని చర్చనీయాంశంగా మార్చాయి. స్వాతంత్ర్య సమరయోధుడి స్ఫూర్తి చుట్టూ రాజకీయ లెక్కలు, సంఘాల విభేదాలు, చందాల వసూళ్లు వెరసి ఈ కార్యక్రమాన్ని వివాదాస్పదం చేశాయి.

వైఎస్సార్‌సీపీ పాలనలో మొదలైన ప్రణాళిక

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో తాడిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు పెట్టాలన్న ప్రతిపాదన కొప్పుల వెలమ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ తరపున జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు సమర్పించగా ఆ వినతిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదించి ప్రత్యేక జీఓ జారీ చేసింది. సంఘం జిల్లా కమిటీ కోరిన మేరకు మాజీ ఎమ్మెల్సీ బొత్స అప్పలనరసయ్య ఆర్థిక సహకారంతో దాదాపు రూ.10 లక్షల వ్యయంతో బుచ్చి అప్పారావు విగ్రహాన్ని తయారు చేశారు. విగ్రహానికి స్థలాన్ని కూడా గత ప్రభుత్వం ఎంపిక చేసి ఇచ్చింది. ఆ స్థలంలో సంఘం ప్రతినిధులు శంకుస్థాపన పూర్తి చేశారు. ఎన్నికల అనంతరం పాలకపక్షం మారింది. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వ కాపు నేతలు విగ్రహస్థాపన ప్రయత్నాన్ని జరగనీయలేదు సరికదా ఆ జీఓను రద్దు చేయించారు. కొప్పుల వెలమ సంఘం గత నలభై ఏళ్లుగా తెలుగు దేశం పార్టీ పాలనలో పలుమార్లు వినతులు సమర్పించినా ఏనాడూ స్పందన రాలేదు. అదే కులానికి చెందిన అయ్యన్న పాత్రుడు మంత్రిగా ఉన్న సమయంలో కూడా ఈ డిమాండ్ పట్టించుకోలేదని సంఘం నాయకులు చెబుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో జిల్లా ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతను ఎదుర్కోలేక చివరికి కూటమి ప్రభుత్వానికి మళ్లీ కొత్త జీఓ జారీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది.


కొప్పుల వెలమ సంఘం సమకూర్చగా సిద్ధంగా ఉన్న గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహం

ఇప్పుడు మరో విగ్రహం-మరో కథ

కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ వ్యవహారంలో కలుగచేసుకుని కొత్త విగ్రహం తయారు చేయించే ప్రతిపాదన తెచ్చారు. అయితే తొలి నుంచి తమ కులానికి చెందిన సమరయోధుడిగా ఆరాధిస్తూ తాడిపూడి రిజర్వాయర్‌కు ఆయన పేరు పెట్టాలని పట్టుపడుతూ ఆయన విగ్రహాన్ని పెట్టాలని కృషి చేసిన కొప్పుల వెలమ సంక్షేమ సంఘాన్ని పక్కను పెట్టి తెలుగుదేశం పార్టీలో స్థానిక మరో కులం తూర్పుకాపు నాయకుల కార్యక్రమంగా తీసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


వైఎస్సార్‌సీపీ పాలనలో కేటాయించిన స్థలంలో విగ్రహ పునాది పూజ చేస్తున్న సంఘం నాయకులు (ఫైల్)

కొత్త విగ్రహం పేరుతో చందాల వసూలు

కొప్పుల వెలమ సంఘం రూ.10 లక్షల వ్యయంతో సిద్ధం చేసిన విగ్రహాన్ని కాదని కొత్త విగ్రహం ఆవిష్కరణ పేరుతో ప్రజల నుంచి వసూళ్ల దందాకు తెరలేపారు. తాడిపూడి రిజర్వాయర్ పరిధిలోని గంట్యాడ, జామి మండలాల గ్రామ ప్రజలు, ఉద్యోగుల నుంచి భారీగా చందాలను బహిరంగంగానే వసూలు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల వారీగా రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలు టార్గెట్ ఇచ్చి వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఈ వసూళ్లపై ప్రజల నుంచి ఆగ్రహం ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది.

దయనీయంగా ఆశ్రమ పాఠశాలలు


రావికోన గిరిజన ఆశ్రమ పాఠశాల

- గిరిజన విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి కరువు


వాడుకకు, తాగేందుకు ఉపయోగించే నీళ్లు ఈ ట్యాంకు నుంచే


వరండాలో మెట్ల కింద విద్యార్థుల పెట్టెలు, ఇతర సామగ్రి

పార్వతీపురం రూరల్: భవిష్యత్ భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన బడులు, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులకు నరక కూపాలుగా మారుతున్నాయి. గిరిజన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలలు, నేడు కనీస సౌకర్యాలకు నోచుకోక వారి పాలిట శాపాలుగా పరిణమించాయి. పార్వతీపురం మండలంలోని రావికోన గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో నెలకొన్న దయనీయ పరిస్థితులే ఇందుకు నిలువుటద్దం. సుమారు 150 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో, చదువుకోవాలన్నా, పడుకోవాలన్నా, భోజనం చేయాలన్నా అన్నీ ఒకే చోట కావడం వారి దుస్థితికి అద్దం పడుతోంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేకపోవడం పెను సమస్యగా మారింది. ఉన్న కొద్దిపాటి గదులనే తరగతులకు, భోజనశాలకు, శయన మందిరానికి వినియోగిస్తున్నారు. పగలు ఎక్కడైతే అక్షరాలు దిద్దుతారో, రాత్రి అక్కడే పక్కలు వేసుకుని నిద్రించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ గదులు కూడా విద్యార్థులందరికీ సరిపోకపోవడంతో, అనేకమంది చలికి, దోమల బెడదకు ఓర్చుకుంటూ వరండాలలోనే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. తమ బట్టలు, పుస్తకాలు దాచుకునే పెట్టెలను మెట్ల కింద పెట్టుకుని, అక్కడే ఒరిగిపోతున్న చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంది.

మంచి నీటికి మంగళం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, రావికోన పాఠశాలలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక్కడ తాగే నీటికి, ఇతర అవసరాలకు ఒకే ట్యాంక్ నీటిని వినియోగించాల్సి వస్తుండడం విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడటమేనని తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రమైన తాగునీరు అందించడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం గిరిజన విద్యార్థుల పట్ల వారికున్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. ప్రభుత్వం, సంబంధిత శాఖ పరమైన అధికారులు తక్షణమే స్పందించి రావికోన ఆశ్రమ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని, సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని, విద్యార్థులకు కనీస మౌలిక వసతులు అందించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని గిరిజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

- పెద్ద చెరువులో తెప్పోత్సవం రేపు


కె.శిరీష, ఇన్‌చార్జ్ ఈవో

విజయనగరం టౌన్: హంస వాహనంపై పైడితల్లి అమ్మవారు విహరించేందుకు తెప్పోత్సవ ఏర్పాట్లను ఆలయ అధికారులు స్వీయ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం పెద్ద చెరువులో తెప్పోత్సవం ట్రయల్ రన్ నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష తెలిపారు. 30 మంది గజ ఈతగాళ్లతో, హంస వా హనం, రెండు పక్క బోట్లుతో పాటూ అగ్నిమాపక అధికారుల బోట్లు ఉంటాయన్నారు. హంస వాహనిపై విహరించే పైడితల్లి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చే అశేష భక్తజనావళికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామ న్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల సాయంతో వేసిన గ్రిల్స్ వరకూ వచ్చి తెప్పోత్సవాన్ని చూసే అవకాశం కల్పించామన్నారు. పెద్దచెరు వు అవతలి గట్టు నుంచి కోటశక్తి ఆలయం వర కూ తెప్పోత్సవాన్ని వీక్షించే అవకాశం ఉందన్నారు. మూడుసార్లు అమ్మవారు పెద్ద చెరువు లో హంస వాహనంపై విహరిస్తూ భక్తులను ఆశీర్వదిస్తారని తెలిపారు. ట్రయల్ రన్ సుమా రు 50 మందితో నిర్వహిస్తామని, కానీ ఉత్సవానికి మాత్రం 20 మంది వరకే అనుమతి ఉందన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంట ల నుంచి నిర్వహించనున్న తెప్పోత్సవాన్ని భక్తులందరూ వీక్షించి తరించాలని కోరారు.

4వేల క్యూసెక్కుల అవుట్ ఫ్లో

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద 4 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఆదివారం నమోదైంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 4వేల క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరడంతో ప్రాజెక్టు వద్ద 64.12 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. వచ్చిన నీటిని రెండు గేట్ల ద్వారా దిగువకు విడిచిపెడుతున్నామని ఏఈ నితిన్ తెలిపారు.